క్లుప్తంగా

రూ.6 లక్షలతో ఆలయ అభివృద్ధి పనులు

కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్ గ్రామంలో కాశీ విశ్వేశ్వర దేవాలయం అభివృద్ధికి గ్రామ మాజీ సర్పంచ్ చెన్ రెడ్డి పవన్‌కుమార్ రెడ్డి రూ.6 లక్షల విరాళం ఇచ్చారు. శుక్రవారం ఆలయ ప్రహరీ, అదనపు గదుల నిర్మాణం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జంగయ్య, ప్రశాంత్, సుగుణ చారి, చంద్రకాంత్, శ్రీధర్, కృష్ణారెడ్డి, నరేష్, కిరణ్, శ్రీను, కొండల్ రెడ్డి, విజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



చారకొండ: వాహనదారులు, ప్రయాణికులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ శంషోద్దీన్ అన్నారు. మండల కేంద్రంలో జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులతో, ప్రయాణికులతో మాట్లాడి అవగాహన కల్పించారు. వాహనదారులు సంబంధిత పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంట పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు ముమ్మరం



తాడూరు: మండలంలోని ఐతోలు సబ్‌స్టేషన్‌లో శుక్రవారం డీఈ శ్రీధర్ శెట్టి, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో లో ఓల్టేజీ సమస్య తీరుతుందని, వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సాయంత్రం 5 గంటల వరకు పనులు పూర్తి చేసి 6 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని ఏఈ శ్రీరాములు తెలిపారు.

విద్యార్థులు బడి మానకుండా చూడాలి



లింగాల: పాఠశాలకు వెళ్లే విద్యార్థులు మధ్యలో చదువు మానకుండా చూడాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ లక్ష్మణ్‌రావు తల్లిదండ్రులను కోరారు. మండలంలోని అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు బడికి వెళ్లడం లేదని తెలుసుకున్న ఆయన శుక్రవారం గ్రామ పంచాయతీ ఆవరణలో తల్లిదండ్రులకు, విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సౌజన్యంతో కోనేర్ సంస్థ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి మధ్యలో బడి మానేసిన పిల్లలను గుర్తించి ఒక దగ్గరకు చేర్చారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ బడీడు పిల్లలు బడిలో ఉండాలని, వారిని బాల కార్మికులుగా మార్చి పనులు చేయిస్తే కేసులు నమోదు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బక్కన్న, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి మల్లేష్, ప్రమీల, ఆంజనేయులు, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు



కల్వకుర్తిరూరల్: మండలంలోని రామగిరి సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల్లోని వివిధ జిల్లాలకు చెందిన వృషభాలు పాల్గొన్నాయి. బండలాగుడు పోటీలను తిలకించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

ఘనంగా దీపారాధన



వెల్దండ: మండల కేంద్రంలోని సయ్యద్ ఖాజా నిందా(షా)వలి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఘనంగా దీపారాధన నిర్వహించారు. ఈనెల 15న ఖురాన్ పఠనం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో దర్గా ముజావర్ కమిటీ సభ్యులు మహ్మద్ శంషోద్దీన్, ఇలియాస్, ఫరీద్, సాదిక్, అల్లాజి ఉన్నారు.

'ఉపాధి'పై సామాజిక తనిఖీ

- మండలంలో రూ.5.82కోట్ల పనులు
- అడిషనల్ డీఆర్‌డీఓ రాజేశ్వరి ఆధ్వర్యంలో విజిలెన్స్ విచారణ



వెల్దండలో సామాజిక తనిఖీ సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్వరి

వెల్దండ: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి అడిషనల్ డీఆర్‌డీఓ రాజేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో 2023, ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వరకు ఉపాధి హామీ పథకంలో చేపట్టిన 644 పనులకు రూ.5.82కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఆ పనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు విచారణ చేపట్టారు. విజిలెన్స్ అధికారులు పూర్తి రికార్డులను పరిశీలించారు. మండలంలోని గ్రామ పంచాయతీల్లో రూ.13,989 అక్రమాలకు పాల్పడినట్లు తెలిపారు. కొన్ని గ్రామాల్లో పంచాయతీ సిబ్బందిపై రూ.8వేల జరిమానా విధించారు. మొత్తం రూ.21,989 రికవరీ చేయాలని అడిషనల్ డీఆర్‌డీఓ, విజిలెన్స్ అధికారులు గుర్తించారు. కార్యక్రమంలో కృష్ణారావు, విజిలెన్స్ అధికారుల బృందం నజీరోద్దీన్, రాజు, అరవింద్ రెడ్డి, అంబుడ్స్ పర్సన్స్ జంగయ్య, ఏపీఓ ఈశ్వర్‌జీ, ఎంపీఓ లక్ష్మణ్, ఎస్‌ఆర్‌పీ బద్రునాయక్, ఈసీ దేవేందర్‌గౌడు, ఆయా గ్రామాల కార్యదర్శులు, ఫీల్డ్ అసిసెంట్లు, డీఆర్‌పీలు ఉన్నారు.

సీతారాముల విగ్రహాల ఊరేగింపు



కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాల గ్రామంలో శుక్రవారం సీతారామ లక్ష్మణ చంద్రస్వామి విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. హనుమాన్ దేవాలయంలో నూతనంగా సీతారామ లక్ష్మణ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించే కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ ప్రధాన రహదారి నుంచి ఆంజనేయ స్వామి దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కైలాసం గుట్ట అభివృద్ధికి శ్రీకారం



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని కైలాసం గుట్ట పైన పురాతనమైన దేవాలయాలున్నాయి. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆ ప్రాంతం కొండలు, గుట్టలు గడ్డి చెట్లతో నిండిపోయింది. దీంతో భక్తులు రావడం గగనంగా మారింది. ఈ పరిస్థితిని గుర్తించిన హిందూ ఐక్యవేదిక నాయకులు పరిస్థితిని చక్కదిద్దాలని నిర్ణయించుకున్నారు. దాతల సహకారంతో కైలాసం గుట్టపై ఆలయాల ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దే కార్యక్రమాలకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. మెట్ల భాగాన్ని సరి చేయడంతో పాటు కొన్నిచోట్ల కాంక్రీటు వేసి ఆలయ పరిసర ప్రాంతాలను మెరుగుపరిచారు. పరిసరాలను సుందరీకరించినందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



కోడేరు: మండల కేంద్రంలో మూడు రోజులుగా కొనసాగిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఉదయం సుప్రభాతసేవ, ప్రాతఃకాల పూజ, రథోత్సవం, దూపోత్సవం, మహామంగళహారతి, మహాశ్వీరచనం, ప్రదోశకాల పూజలు, సత్యనారాయణస్వామి వ్రతం, తదితర పూజలు నిర్వహించినట్లు అర్చకులు రాఘవేంద్ర శర్మ తెలిపారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయించండి



నాగర్‌కర్నూల్‌రూరల్: గత ప్రభుత్వంలో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను అర్హులైన పేదలకు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందికొండ గీత డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రం శివారులో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను శుక్రవారం సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చుపెట్టి నిర్మించిన ఇళ్లను పేదలకు పంచకపోవడంతో నిరుపయోగంగా మారాయన్నారు. కొన్ని ఇళ్లు శిథిలావస్థకు చేరుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో 5వేల మందికి సొంతిళ్లు లేక అద్దె గదుల్లో జీవనం సాగిస్తున్నారని.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా డబుల్‌బెడ్రూం ఇళ్లవైపు కన్నెత్తి చూడకపోవడం దారుణమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో సర్వేలు నిర్వహించడం కాకుండా ఉన్న ఇళ్లను పేదలకు పంచాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామయ్య, అశోక్ , యాదయ్య, సత్యనారాయణ, మల్లేష్, కురుమయ్య పాల్గొన్నారు.

గుండాల ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆహ్వానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

వెల్దండ: మండలంలోని గుండాల గ్రామంలో అంబా రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని శుక్రవారం దేవాలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 26నుంచి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆహ్వానించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ సందీప్ రెడ్డి, వైస్‌చైర్మన్ అరుణ్‌నాయక్, మల్లేష్‌ముదిరాజ్, అంజయ్య, ఈఓ ప్రసాద్, కిసాన్‌సెల్ అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, సురేందర్‌రెడి, కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు ఉన్నారు.

కులాంతర వివాహాలకు రక్షణ చట్టం చేయాలి



మాట్లాడుతున్న శివవర్మ

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వాలు కులాంతర వివాహాల ప్రత్యేక రక్షణకు చట్టం కోసం సభల్లో తీర్మానం చేయాలని కేవీపీఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి బి శివవర్మ ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కులం, మతాంతర వివాహితుల ఆత్మీయ అభినందన సభ నిర్వహించి మాట్లాడారు. కులాంతర వివాహితుల ప్రత్యేక రక్షణ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. కులాంతర వివాహాల ప్రొత్సాహం కేవలం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మాత్రమే జోఓ నంబరు 12 ద్వారా రూ.2.50 లక్షలు ఇస్తోందని, మైనార్టీ, ట్రైబ్ డిపార్ట్‌మెంట్లు ప్రొత్సాహం ఇవ్వడంలేదన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు రూ.10 లక్షల ప్రొత్సాహం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు శ్రీశైలం, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న, జిల్లా కార్యదర్శి పరశురాములు ఉపాధ్యక్షులు బంతిని రాజు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పాలెం పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఇతర అధికారులు

బిజినేపల్లి/కోడేరు: స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా ఆయా గ్రామాలకు చెందిన పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ కథలప్ప, ఎన్నికల సిబ్బంది శుక్రవారం పరిశీలించారు. పాలెం, ఖానాపూర్, గుడ్లనర్వ గ్రామాలకు చెందిన ఆయా పాఠశాల పోలింగ్ కేంద్రాలలోని ర్యాంప్‌లను, మరుగుదొడ్లను, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు వంటి వాటిని పరిశీలించారు. ఎన్నికల కోడ్ కంటే ముందుగానే ఎన్నికలకు సిద్ధం కావాలని, పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాల ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కాగా పాలెం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల పది విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మోటివేషనల్ క్లాస్‌లో పాల్గొన్నారు.

- కోడేరు మండలంలోని ఎత్తం గ్రామ పంచాయతీ, హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. భవనాలు పరిశుభ్రంగా ఉంచి, వసతులు సమకూర్చాలని పంచాయతీ కార్యదర్శి రమేష్‌కు సూచించారు.

విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు



విజేతలైన విద్యార్థులతో ఎంఈఓ, ఉపాధ్యాయులు

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలు పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పాటవ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్ష పోటీలలో మండలంలోని ఆవంచ, పోతిరెడ్డిపల్లి, మారేపల్లి, కస్తూర్బాగాంధీ, జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభా పాటవ పరీక్షలో స్థానిక పాఠశాలకు చెందిన లావణ్య ప్రథమ, వెంకటేష్ ద్వితీయ, పుష్పలత తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. పోతిరెడ్డిపల్లి విద్యార్థిని శ్రీజకు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ, ఉపాధ్యాయులు శాంసన్, పరందాములు, బాలయ్య, ప్రసన్నకుమారి, నటరాజ్, ప్రశాంత్, వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుల్వామా ఘటనలో అమర సైనికులకు నివాళి



తిమ్మాజిపేట: జమ్ముకాశ్మీర్ రాష్ట్రంలోని పుల్వామా ఘటనలో అమరులైన సైనికులకు యువకులు కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. మండలం లోని పోతిరెడ్డిపల్లిలో శుక్రవారం రాత్రి బస్టాండు ఆవరణలో యువశక్తి యూత్ ఆధ్వర్యంలో యువకులు వీర సైనికుల చిత్రపటాలకు నివాళులర్పించారు. వీర సైనికుల ఫొటోలను ప్రదర్శిస్తూ గ్రామంలోని వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లిలో బంద్ సంపూర్ణం



పెంట్లవెల్లిలో ఎస్సీ వర్గీకరణపై వ్యతిరేక పోరాట సమితి నాయకులు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో శుక్రవారం ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు బంద్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సమితి పోరాట నాయకుడు ఎర్ర శ్రీను మాట్లాడారు. ప్రభుత్వం ఓటు బ్యాంక్ రాజకీయాలకు పాల్పడుతూ మాలల జనాభాను తక్కువ చేసి చూపుతోందన్నారు. దీన్ని అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంద ని, ఆ తీరును నిరసిస్తూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పెంట్లవెల్లిలో బంద్ నిర్వహించారు. వర్గీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండల కన్వీనర్ ఎర్ర శ్రీనివాస్, హనుమంతు, నాగరాజు, కుమార్, వెంకటేష్, రామకృష్ణ, మోహన్, సుధాకర్, వెంకటస్వామి, కేశవులు, బాలపీర్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేక నిరసన

కొల్లాపూర్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పట్టణంలో మాల సంఘం నాయకులు నిరసన తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసనలో తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు కలమంద శేఖర్ మాట్లాడారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఏకపక్షంగా వర్గీకరణకు అనుకూల నిర్ణయాలు తీసుకోవడం దారుణమన్నారు. మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, సందీప్, కురుమయ్య, బాలస్వామి తదితరులున్నారు.

చదువుతోనే అభివృద్ధి సాధ్యం



పోతిరెడ్డిపల్లిలో సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

తిమ్మాజిపేట: చదువుకోవడం వల్లనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించవచ్చని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి అన్నారు. మండలంలోని నేరళ్లపల్లిలో రూ.53 లక్షలతో నిర్మించిన నూతన అదనపు గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. మండలంలోని పోతిరెడ్డిపల్లిలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ, మల్లయ్యగౌడ్, దయాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, నాగసాయిలు, జంగిరెడ్డి, సురేందర్‌రెడ్డి, వివేక్‌రెడ్డి, రామకృష్ణగౌడ్, జమీర్, తిరుపతయ్య, రాములు, జంగయ్య, చంద్రు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వం లక్ష్యం

తెలకపల్లి: గ్రామాల అభివృద్దే ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని కమ్మారెడ్డిపల్లిలో నూతనంగా సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. గ్రామంలో నాలుగు చోట్ల రూ.13 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. ఆయన వెంట సింగిల్‌విండో వైస్ చైర్మన్ మామిళ్ళపల్లి యాదయ్య, మాజీ ఎంపీపీ బండ పర్వతాలు, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు సుమిత్ర, తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు జన్మనిచ్చి.. తనువు చాలించి

- రక్తస్రావంతో బాలింత మృతి

అచ్చంపేట రూరల్: బిడ్డకు జన్మనిచ్చిన గంటల వ్యవధిలోనే తల్లి మృతిచెందిన ఘటన తీవ్ర విషాదం రేపింది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోని ఎర్రారం తండాకు చెందిన సరిత (22) మొదటి కాన్పు నిమిత్తం శుక్రవారం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. మధ్యాహ్నం వైద్యులు ప్రసవం చేయడంతో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో తల్లికి రక్తస్రావం కావడంతో మెరుగైన వైద్యం కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. శిశువు అచ్చంపేట వైద్యుల పర్యవేక్షణలో ఉన్నాడు. కాగా, అమ్రాబాద్ మండలం మన్ననూరుకు చెందిన సరితకు ఎర్రారం తండాకు చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. బిడ్డ పుట్టిన గంటల వ్యవధిలోనే తల్లి మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింత మృతిచెందిందని ఆరోపిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెల్దండ: మండలంలోని బైరాపూర్, బొల్లంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ సూర్యంనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుర్తిలోని 132/33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంతో మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సరఫరా నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

ఏకకాల రుణపరిష్కార పథకం

పెద్దకొత్తపల్లి: సింగిల్‌విండో ద్వారా 31-03-2018 నాటికి ఎంపీఏగా మారిన ఖాతాలకు వాయిదా మీరి వడ్డీ 100 శాతం రాయితీ కలదని ఏకకాల రుణ పథకం ద్వారా రుణాలను చెల్లించ వచ్చని సింగిల్‌విండో కార్యదర్శి సిరాజు తెలిపారు. ఈ పథకం జనవరి 15 నుంచి ఫిబ్రవరి 15వరకు మాత్రమే కలదు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

16న ఆర్థోపెడిక్ వైద్య శిబిరం

అచ్చంపేట రూరల్: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో 16న ఆదివారం శ్రీకర హాస్పిటల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం అచ్చంపేట అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని విశ్రాంత ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఉదయం 11 గంటలకు వైద్య శిబిరం ప్రారంభం చేస్తామని తెలిపారు.

మామిడి సాగులో జాగ్రత్తలు పాటించాలి

కొల్లాపూర్: మామిడి సాగు చేస్తున్న రైతులు తగిన జాగ్రత్తలు పాటిస్తేనే పంట దిగుబడి సాధించవచ్చని కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త ఆదిశంకర్, కొల్లాపూర్ డివిజన్ ఉద్యాన అధికారి లక్ష్మణ్ సూచించారు. శుక్రవారం కొల్లాపూర్ మండలం కుడికిళ్ల గ్రామంలో ఉద్యాన రైతులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫామ్ ఏరియా మేనేజర్ రాకేష్, క్లస్టర్ ఆఫీసర్లు చంద్రశేఖర్, రాము, గోవర్ధన్, కోరమాండల్ మార్కెటింగ్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, శివ ఉన్నారు.

విద్యార్థి ప్రవర్తనపై ఆందోళన

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్ పదో తరగతి విద్యార్థి మూడు రోజుల క్రితం తాగునీటి ఫ్రిజ్‌లో ఉమ్మేశాడని ఆ రోపణలు రావడంతో బీజేపీ, వీహెచ్‌పీ, ఏబీవీపీ, తల్లిదండ్రులు శుక్రవారం ఆ స్కూల్ వద్ద ఆందోళన చేపట్టారు. విద్యార్థి ప్రవర్తనపై చర్యలు తీసుకోవాలని స్కూల్ ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. విద్యార్థి తండ్రిని గురువారం స్కూల్ వద్దకు పిలిపించగా, స్కూల్ ప్రిన్సిపాల్, ఇతర సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించి, దుర్భాషలాడినట్లు పేర్కొన్నారు. ఆందోళన విషయం తెలియడంతో ఎస్‌ఐ రమేష్ స్కూల్ వద్దకు చేరుకొని విచారణ చేపట్టారు. స్కూల్ వద్దకు వచ్చిన కొందరు సమస్యను సద్దుమణిగేలా ప్రయత్నాలు చేశారు.

సభను విజయవంతం చేయాలి

బిజినేపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో 16న నిర్వహించే సగర శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్, ఆయా గ్రామాల అధ్యక్షులకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని ఖానాపూర్, సల్కర్‌పేట, శాయిన్‌పల్లి, గంగారం పోలేపల్లి, నందివడ్డెమాన్, తదితర గ్రామాల్లో పర్యటించి సగర సంఘం నాయకులకు సూచనలు చేశారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



తెలకపల్లి: విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ప్రధానోపాధ్యాయుడు విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవ ప్రదమైందన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టీ శ్రీనివాసులు, జీ సత్యనారాయణ, ఎం జగదీష్, పి రాజశ్రీ, జి శివలీల, కే అలివేల పాల్గొన్నారు.

విద్యార్థులతో అటవీ విజ్ఞానయాత్ర



మన్ననూర్: అటవీ వనదర్శినిలో భాగంగా గిరిజన ఉన్నత పాఠశాల మన్ననూర్, అచ్చంపేట పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఫారెస్టు అధికారుల (ఎఫ్ఆర్‌ఓ) సమక్షంలో అటవీ, వన్య ప్రాణి విజ్ఞాన యాత్ర నిర్వహించారు. శుక్రవారం సుమారు 60 మంది విద్యార్థులు నల్లమలలో సందడి చేశారు. ఈ సందర్భంగా మన్ననూర్‌లోని అటవీ విజ్ఞాన కేంద్రంలోని మ్యూజియంలో జంతు అవశేషాలు, జంతువుల చిత్రాలను వీక్షించారు. అడవులు, వన్య ప్రాణులు ముఖ్యంగా పెద్దపులుల ప్రాముఖ్యత, వాటి పరిరక్షణ, జీవ వైవిధ్యం, ప్లాస్టిక్ ఫ్రీ జోన్, బయోల్యాబ్, ఏకో టూరిజం, జంగిల్ సఫారీ తదితర అంశాలపై డిజిటల్ తరగతులుగా అటవీ ఎడ్యుకేషనల్ అధికారి శ్వేత అవగాహన కల్పించారు. అనంతరం సఫారీ వాహనాలలో అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలోని ప్రకృతి రమణీయమైన ప్రదేశాలు వ్యూ పాయింట్, ఆక్టోపస్ల పరిసర ప్రాంతాలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు తరలి వెళ్లారు. వనదర్శిని ద్వారా చాలా విషయాలు తెలుసుకున్నామని, అందుకు సహకరించిన అటవీ శాఖ అధికారులు, సిబ్బందికి విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌ఓలు సుబూర్, హన్మంత్‌నాయక్, సెక్షన్, బీట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ధైర్యంగా ఉండాలి



తెలకపల్లి: బాలికలు ధైర్యంగా ముందుకెళ్లాలని షీ-టీం జిల్లా ఇన్‌చార్జి విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షీ-టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో జాతరల్లో, ఆటో, బస్సులలో మహిళలు, బాలికలు వేధింపులకు గురవుతున్నారన్నారు. ఆన్‌లైన్‌లో అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బాధితులు ఎవరైనా 100కు గాని, 8712657676 నంబర్‌కు గాని ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. భరోసా కేంద్రం కో ఆర్డినేటర్ శ్రీలత మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి, సఖీ భరోసా సభ్యులు శ్రీలత, సునిత, షీ-టీం మెంబరు వెంకటయ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.